ప్రజాశక్తి

శనివారం 1 నవంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

నానుతున్న పంటలు

- రైతులకు దెబ్బ మీద దెబ్బ
- ప్రభుత్వం నుంచి సాయం అందేనా?



యడ్లపాడు మండలంలో దెబ్బతిన్న పత్తి పైరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలోని రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సాగులో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జులై నుంచి అక్టోబరు వరకు నాలుగు నెలల కాలంలో పలుమార్లు అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతిన్నాయి. డెల్టాలో వరి, మెట్ట ప్రాంతంలో పత్తి, అపరాలు, శనగ, మొక్కజొన్న రైతులకు ఈఏడాది ఎదురయిన కష్టాలు ఎప్పుడూ ఎదురు కాలేదంటున్నారు. ప్రధానంగా కొల్లిపర, దుగ్గిరాల, చేబ్రోలు, పెదకాకాని, తాడేపల్లి మండలాలలోని వివిధ గ్రామాల్లో వరి సాగు చేసిన రైతులకు మూడు సార్లు అధిక వర్షాలు, వరద వల్ల పైర్లు దెబ్బతిన్నాయి. ఆగస్టు 13,14 తేదీల్లో కురిసిన అధిక వర్షాలతో ముంపు సమస్య ఏర్పడి వరి పైరు దెబ్బతింది. జులైలో కూడా ఇదే పరిస్థితి తలెత్తింది. మొత్తంగా రెండు సార్లు పంట దెబ్బతిని 25 వేల మంది రైతులు నష్టపోయారు. దాదాపు 70 వేల ఎకరాల్లో పంట తిరిగి వేశారు. తరువాత వరదలకు మరోసారి వరి పైరు నీట మునిగి ఎందుకు పనికిరాకుండాపోయింది. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం రాలేదు.

నిబంధనల ప్రకారం పంట చేతికి వచ్చే దశలో ప్రకృతి వైపరిత్యాలు సంభవించి 33 శాతం కన్నా ఎక్కువ నష్టం జరిగితే పరిహారం వస్తుందని అధికారులు తెలిపారు. తాజాగా మొంథా తుపాను తాకిడికి పంటలు మళ్లీ నీటమునిగాయి. ఈసారి కొల్లిపర మండలంలో నష్టం తక్కువగా ఉండగా కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టి చెరుకూరు మండలాల్లో అధిక నష్టం వాటిల్లింది. 60 వేల ఎకరాల్లో వరి, పత్తి, అపరాల పంటలు ముంపునకు గురి కాగా 33 శాతం మేరకు పంట నష్టం జరగలేదని, నీరు తొలగిపోతే నష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు. సాగు కోసం ఎకరాకు రూ.20 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. కౌలు సొమ్ము ఇందుకు అదనం.

▶ 2లో



సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

పంట చేతికి రావాలన్నా ఖర్చు అధికమే

- నష్టపరిహారానికి బాధితులను నిష్పక్షపాతంగా గుర్తించాలి
- సత్వరమే అంచనాలు రూపొందించాలి
- పొలాల్లో రైతు, కౌలురైతు సంఘాల పరిశీలన

ప్రజాశక్తి-చిలకలూరిపేట, సత్తెనపల్లి రూరల్

తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో ప్రభుత్వం సత్వరమే పరిహారం ఇవ్వాలని, రైతు, కౌలురైతు సంఘాలు, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మొంథా తుపాను వల్ల పైర్లు దెబ్బతిన్న పొలాలను నాయకులు శుక్రవారం పరిశీలించారు. చిలకలూరిపేట మండలం కొండ్రుపాడు, కావూరులో పొలాలను కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, నాయకులు ఎస్.లూథర్, సిఐటియు పి.వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పొలాలను రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, కౌలురైతు సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి పి.మహేష్ ఇతర నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలకలూరిపేట మండలం పసుమర్రు, ఇతర ప్రాంతాల్లోని డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేనందున ఎక్కడి వర్షపు నీరు అక్కడే పొలాల్లో రోజుల తరబడి నిలిచి పంటలు

▶ 2లో

హత్యాచారం కేసులో యావజ్జీవం

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని గణపవరంలో గతేడాది ఆగస్టులో జరిగిన హత్యాచారం కేసులో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నరసరావుపేట 13వ అదనపు జిల్లా కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. గణపవరంలోని పీర్ల చావిడి గదిలో నిద్రిస్తున్న మహిళను ఒడిశాకు చెందిన మనోజ్ మాలిక్ అలియాస్ రాజు, గణపవరం గ్రామానికే చెందిన ఎం.సాంబశివరావు అత్యాచారం చేసి ఆపై హతమర్చారు. సంచలనం కలిగించిన ఈ కేసును చిలకలూరిపేట రూరల్ సిఐ బి.సుబ్బనాయుడు దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సురేష్‌బాబు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో దోషులకు మూడుసార్లు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

అవయవదానం.. నలుగురికి కొత్త జీవితం

ప్రజాశక్తి- తాడేపల్లి



హరివిజయ కుమార్ (ఫైల్)

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానానికి కుటుంబీకులు ముందుకు రావడంతో నలుగురు జీవితాల్లో నూతన వెలుగు వచ్చింది. కృష్ణాజిల్లా, గుడివాడకు చెందిన సివిల్ ఇంజినీర్ గుడివాడ హరివిజయకుమార్ (46) తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బ్యాంకు పని నిమిత్తం మంగళగిరి వచ్చారు. ఫిట్స్ రావడంతో మంగళగిరిలోని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మెదడులో రక్తస్రావం జరిగిందని గుర్తించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. విజయ్ కుమార్ భార్య యోగ విష్ణుప్రియ, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. కాలేయం, కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లోని వ్యక్తికి అమర్చారు. మరో కిడ్నీని విజయవాడ కామినేని హాస్పిటల్, కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.



అడుగైనా పడని వరికపూడిసెల

సత్వరమే ప్రాజెక్టు పనులు చేపట్టాలని ఆందోళన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : పల్నాడు రైతుల దశాబ్ధాల కలైన వరికపూడిసెల ప్రాజెక్టు పనులు వెంటనే మొదలు పెట్టాలని ప్రాజెక్టు సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు వరికపుడిసెల సాధన సమితి, పల్నాడు రైతులు, కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 70 ఏళ్లుగా వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మించాలని ఆందోళనలు జరుగుతున్నాయని, ఇప్పటికి ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు చేసినా ఆచరణ మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. దీని ఫలితంగా దాదాపు 80 వేల ఎకరాలకు సాగునీరు లేక ఆఖరికి తాగునీరు కూడా లేక ఎగువ పల్నాడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కృష్ణా నదికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రజలకు కూడా తాగడానికి నీళ్లు దొరకడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, రైతులు దాదాపు 1500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా చుక్క నీరు పడక పంటలు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మరికొందరు రైతులు వలసలు వెళ్లిపోతున్నారని, ఇది కొనసాగితే భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎడారిగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి బి.మహేష్ పల్నాడు శ్రీను, దళిత బహుజన భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి, సిపిఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, మాజీ డిప్యూటీ డీఈవో గాదె రామకృష్ణారావు, వీరబ్రహ్మేంద్ర ప్రజా హక్కుల పోరాట సమితి అధ్యక్షులు గురజాల అప్పారావు, మాజీ సర్పంచి బత్తుల వీరయ్య యాదవ్, కోనంకి సాంబయ్య యాదవ్, కొక్కెర సురేష్‌బాబు, జరపరాల సుధాకర్ నాయక్, డి.లింగయ్య, బండారు శ్రీను, పి.జయరావు, టి.సత్యం, పాటి శ్రీరామ్మూర్తి, సాంబిరెడ్డి, ఎం.గోవిందారెడ్డి, సింగాల విజయరాజు పాల్గొన్నారు.

3న కలెక్టరేట్ వద్ద కౌలురైతుల ధర్నా

ప్రజాశక్తి - పెదనందిపాడు

కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని సత్వరమే జమ చేయాలని, నూతన కౌలు చట్టాన్ని తేవాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద 3న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ భూయజమాని సంతకం ఉంటేనే గత ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డు ఇచ్చిందని, కార్డులు వచ్చిన వారికే రైతు భరోసా ఇచ్చిందని, అయితే ఓసీ కౌల్దార్లను మాత్రం ఇందులో మినహాయించిందని అన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి దీన్ని విమర్శించిందని, తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులను ఆదుకొనేలా కొత్త చట్టం తెస్తామని, ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముసాయిదా చట్టాన్ని తయారుచేసి వివిధ ప్రాంతాల్లో రైతు సంఘాలు, సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారని, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు శాసనసభలో ప్రత్యేకంగా పాత చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు, కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇస్తున్నట్టు ప్రకటించారని, అయితే ముసాయిదాను అసెంబ్లీలో చట్టం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని పంటలకు మద్దతు ధరలు పడిపోయాయని, విత్తనాలు, పురుగు మందుల

▶ 2లో

పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో అభివృద్ధి, పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని, ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండడానికి వీల్లేదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ దుర్గానగర్, ఐపిడి కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య, అభివద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా చేపట్టిన అభివద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువు మేరకు జరిగేలా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లేకుంటే సంబందిత ఎమినిటి కార్యదర్శి, ఏఈలే భాద్యత వహించాలని స్పష్టం చేశారు.అనంతరం ఐపిడి కాలనీలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, ఎక్కడా డంపింగ్ పాయింట్లను లేకుండా ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. కమర్షియల్ సంస్థలు వ్యర్ధాలను రోడ్లు, డ్రైన్లలో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వాలని, అవసరైమతే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ విష్ణు, డిఈఈ శ్రీనివాస్, ఎస్-ఎస్ ఆయూబ్ ఖాన్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నిబద్ధత కలిగిన అధ్యాపకుడు దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బోటనీ అధ్యాపకుడైన కెవిఎస్ దుర్గాప్రసాద్ పదవీ విరమణ సభ శుక్రవారం హిందూ కళాశాలలో ఘనంగా జరిగినది.ఈసభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.విశ్వం అధ్యక్షత వహించి మాట్లాడుతూ దుర్గాప్రసాద్ నిబద్ధత కలిగిన అధ్యాపకుడని, కళాశాలలో అన్ని రంగాలలో మంచి అనుభవం ఉన్న వ్యక్తి, కళాశాల కోసం అప్పజెప్పిన పనిని అద్భుతంగా నిర్వహించేవాడని ఆయన గుర్తు చేసుకున్నారు. కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్ మాట్లాడుతూ దుర్గా ప్రసాద్ విద్యార్థులకు పాఠాలను చక్కగా బోధించడంతోపాటు, కళాశాల లలిత కళా సమితిని అద్భుతంగా నిర్వహించారని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు. కళాశాల పాలకమండలి కార్యదర్శి చెరువు రామకష్ణమూర్తి మాట్లాడుతూ దుర్గాప్రసాద్ యువతకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకమండలి సభ్యులు మాజేటి సోమశేఖర్‌రావు, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.గౌరీశంకర్, కళాశాల అధ్యాపక సంఘ అధ్యక్షులు డాక్టర్ రామిరెడ్డి, కార్యదర్శి పి.వి.రాము, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సెయింట్ ఆన్స్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడెట్లు జాతీయ పతాకాలు, నినాదాలతో గోరంట్ల పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ టి.సంధ్య, ఆర్.షారూన్‌రోజ్, జి.బాలశౌరెడ్డి, ఐ.ఆదిలక్ష్మి, కె.సుస్మిత, అధ్యాపకులు పాల్గొన్నారు.



వికసిత్ భారత్ లక్ష్యం : మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరులో ఐక్యతా ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం యూనిటీ మార్చ్' ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్‌లో భాగంగా ర్యాలీని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రభుత్వ మహిళా కళాశాల వరకు ర్యాలీని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రభావంతో స్వాతంత్ర్య ఉద్యమంలో పనిచేసిన పటేల్ రైతులు, కార్మికులు, ప్రజల హక్కుల కోసం పోరాడారని, పరిపాలనలో క్రమశిక్షణ, న్యాయం, ప్రజాస్వామ్య విలువలు పాటించారని చెప్పారు. ఆయన భారత పరిపాలన వ్యవస్థకు బలమైన పునాది వేసారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ కేవలం నాయకుడే కాదని, దేశ ఐక్యతకు చిహ్నమని అన్నారు. కార్యక్రమంలో టుబాకో బోర్డ్ చైర్మన్ యశ్వంత్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, నగర పాలక సంస్థ కమిషనర్ పులి. శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మొంధా తుపాన్ కారణ ంగా జీవనం భృతి కోల్పోయి, రిలీఫ్ సెంటర్లో ఉన్నటు వంటి 271 కుటుంబాలకు, జీవన వృత్తి కోల్పోయిన 250 మంది మత్స్యకారుల కుటుంబాలకు శుక్రవారం తాడేపల్లి పట్టణం లోని సీతానగరం రామకృష్ణ మిషన్ హై స్కూల్ లో తాడేపల్లి తహసిల్దార్ డి సీతారామయ్య, టిడిపి మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యన్నా రాయణ, తాడేపల్లి పట్టణ టిడిపి అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు చేతుల మీదుగా శుక్రవారం నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ డి.సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రిలీఫ్ సెంటర్లో ఉన్న 271 కుటుంబాలకు, అలాగే 250 మత్స్యకార కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఇల్లు నష్టపోయిన వారు ఎవరైనా ఉన్నట్లయితే మా దృష్టికి తీసుకువస్తే వాటిని ఎన్యూమీరేషన్ చేసి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దారా దాసు, ఇట్టా పెంచలయ్య, ఇట్టా భాస్కర్, తాడిబోయిన భాస్కర్, మేకా పుల్లారెడ్డి, మేకా శ్రీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,కంభం సాయి చంద్, సంజీవ్ రెడ్డి, టి.గోపి,టి.దుర్గారావు, జనసేన పార్టీ నాయకులు దినేష్ చక్రవర్తి, ఫిషర్ మ్యాన్ సొసైటీ నాయకులు సైకం మల్లేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.


చిలకలూరిపేట మండలంలో పత్తి పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

పంట చేతికి రావాలన్నా ఖర్చు అధికమే

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతిన్నాయన్నారు. డ్రెయినేజీ బోర్డు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. సత్తెనపల్లి ప్రాంతంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, శనగ, వంటి పంటలు దెబ్బతిన్నాయిని చెప్పారు. కోతకు సిద్ధంగా ఉన్న, వెన్ను దశలో ఉన్న వరి నేలకొరిగి కంకులు నీటిలో నానుతున్నాయని అన్నారు. ఈ పంటను దక్కించుకోవాలన్నా రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుందని, దిగుబడి కూడా సగానికి తగ్గే అవకాశం ఉందని అన్నారు. కౌలురైతులకు మరింత నష్టమన్నారు. తక్షణమే పంట నష్టం అంచనాలు వేయాలని, పరిశీలన బృందాల్లో అధికారులు, సిబ్బందితోపాటు రైతుసంఘం, కౌలు రైతుసంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదార్లను నిష్పక్షపాతంగా గుర్తించాలని కోరారు. తుపానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలలో పంటలు నష్టపోతే ఎకరాకు వరికి రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలని భూపేంద్ర సింగ్ హుడా కమిటీ 2010లో నివేదిక ఇచ్చిందని, ఇప్పుడు పెట్టుబడి ఖర్చులు పెరిగిన దృష్ట్యా వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50, వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులందరికీ పంట నష్ట పరిహారం అందించాలన్నారు. పరిశీలనలో వ్యవసాయ కార్మిక సంఘం సత్తెనపల్లి మండల కార్యదర్శి జె.భగత్, నాయకులు బి.రామారావు, కౌలురైతు సంఘం నాయకులు దుగ్గి పెద్ద తాతారావు, చిన్న తాతారావు, రైతు సంఘం నాయకులు మక్కపాటి శివరావు తదితరులు పాల్గొన్నారు.

నానుతున్న పంటలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికీ మూడ్రోజులపాటు నీటిలోనే పంటలు తేలియాడుతున్నాయి. దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. మరో రెండురోజుల్లో నీరు బయటకు పోతే నష్టం అంచనాలను గణనీయంగా తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందా లేదా అన్న అంశంపై సంశయం ఏర్పడింది. నీరు బయటకు పోతే పంటలు కోలుకుంటాయని, కానీ దిగుబడి తగ్గవచ్చునని అంచనా వేస్తున్నారు. కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో ఉద్యాన పంటలు కూడా నీట మునిగాయి. పలు గ్రామాల్లో అరటి, కంద, పసుపు, కూరగాయాల తోటలు ముంపునకు గురయ్యాయి. ఎకరాకు లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ముంపునకు కంద, పసుపు దుంపలు కుళ్లిపోతాయి. అరటి కూరగాయలు పూల తోటలు కూడా కొన్ని ప్రాంతాల్లో మునిగాయి. వాగుల వల్ల వచ్చిన వరద నీటితో జిల్లాలోని ఎక్కువ మండలాల్లో ముంపు సమస్య వెంటాడింది. తాడేపల్లి, దుగ్గిరాల, కొల్లిపర, కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టి చెరుకూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల పరిధిలో 140 గ్రామాల్లో 60 వేల ఎకరాల్లో ముంపునకు గురయ్యాయి. అయితే తుదినివేదికలో ఎన్ని ఎకరాల్లో నష్టం నిర్ధారిస్తారు? పరిహారం ఎంత మందికి అందుతుందనేది ప్రశ్నార్ధకంగా మారింది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అయితా నాగేశ్వరరావు ప్రజాశక్తితో మాట్లాడుతూ పొలాల్లో నీరు బయటకు పోతే అధిక నష్టం నుంచి రైతులు బయటపడతారని అన్నారు. ఈ మేరకు తగు ఏర్పాట్లు చేశామని, తుది దశలో నష్టం 10 వేల ఎకరాల్లోపు ఉంటుందని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు.


ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పాశం రామారావు తదితరులు

3న కలెక్టరేట్ వద్ద కౌలురైతుల ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ధరలు విపరీతంగా పెరిగాయని, తగినన్ని ఎరువులు అందుబాటులో లేవని అన్నారు. పెట్టుబడిలు పెరగడం, పంటలకు మద్దతు ధరల్లేకపోవడం వల్ల ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 300 మందికి పైగా కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని ప్రభుత్వం గుర్తించి కౌల్దార్లను ఆదుకోవాలని కోరారు. వాస్తవ సాగుదార్లయిన కౌలురైతులకు పంట రుణాలివ్వడం లేదని అన్నారు. గూగుల్ సంస్థకి రూ.22 వేల కోట్ల సబ్సిడీ ఇచ్చారని, పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు రుణాలు మాఫీ చేశారని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో జరిగే ధర్నాకు కౌల్దార్లంతా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కె.వెంకటశివరావు, ఎం.వెంకటేశ్వర్లు, డి.రమేష్‌బాబు, కె.చంద్రరావు, పి.శేషగిరిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూపూడి రంగరాజు

హిందూ ఫార్మసీలో వల్లభాయిపటేల్ జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవాసంస్థ అద్వర్యంలో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షత వహించి సర్దార్ వల్లభాయి పటేల్ ఉక్కుమనిషిగా పేరుగాంచిన స్వాతంత్ర్య సమరయోధుడని, దేశ ఉపప్రధానిగా,హోంమంత్రిగా దేశసేవ చేశారని విద్యార్థులకు తెలియచేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ జే.శివజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ, పటేల్‌కు నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం గుంటూరులోని పలు ప్రాంతాల్లో ఆమె విగ్రహా లకు కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. 57వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు జరిగాయి. దేశానికి ఆమె చేసిన సేవలను మస్తాన్ వలి కొనియాడారు. అలాగే గుంటూరు కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సభ జరిగింది. పలువురు నేతలు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అలాగే మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ గారి జయంతి కార్యక్రమం కూడా నిర్వహించారు. ఇందిరా గాంధీ, వల్లభాయ్‌పటేల్ విగ్రహాలకు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. దేశానికి వారు అందించిన సేవలను కొనియాడరు. కాంగ్రెస్ నాయకులు బిళ్లా సునీల్, గడ్డంపాల్ విజయకుమార్, రాచకొండ జాన్‌బాబు, యన్నంసుధీర్, వాల్మికి శ్రీనివాసరావు, పరిశుద్ధరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతశిల్పి వల్లభాయ్ పటేల్

ప్రజాశక్తి-గుంటూరు

దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడి భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలిపిన దేశసమైక్యత శిల్పి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయులని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. శుక్రవారం వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా మానవత స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని కాసు సాయమ్మ మున్సిపాల్ హైస్కూల్ ప్రాంగణంలో జాతీయ ఐక్యత దినోత్సవ సభ నిర్వహించారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం 562 సంస్థానాలను విలీనం చేసి జాతీయ ఐక్యతను కాపాడిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుందన్నారు. తుమ్మూరి విజయ్‌కష్ణ మాట్లాడుతూ భారతీయులందరూ కుల, మత ప్రాంతాలకు అతీతంగా సమిష్టిగా కషి చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు.కార్యక్రమంలో మానవత నేతలు చావా శివాజీ, లక్ష్మీసామ్రాజ్యం, యలమంచలి శివాజీ, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని కొరిటపాటి సుస్మిత ప్రసంగించారు.

అయ్యప్పలకు సద్ది వితరణ

ప్రజాశక్తి - చేబ్రోలు



కొలసాని రాము

అయ్యప్పలకు సద్దిని కొలసాని రాము వితరణ చేశారు. చేబ్రోలు నాగేశ్వరస్వామి దేవాలయంలో ఎనిమిది రోజులుగా గట్టుపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేబ్రోలు గ్రామం చుట్టుపక్క గ్రామాలు అయ్యప్ప లకు సభ్య కార్య క్రమం నిరాటంకంగా జరిగిస్తు న్నారు. ఈ అన్నదాన కార్యక్రమం 41రోజులపాటు అయ్యప్పల కోసం నిర్వహిస్తున్నారు. తన వంతు సహకారంగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో రేపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము అన్నదాన కార్యక్రమానికి రూ.70వేల విలువ గల 12.50 క్వింటాల బియ్యాన్ని నిర్వాహకులకు అందజేశారు. గతంలోనూ అనేక సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహణకు తోడ్పాటు అందించారు.



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇందిరా గాంధీకి నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి

మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మంగళగిరి పట్టణంలోని భార్గవ్ పేట, గౌతమ్ బుద్ధ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. సలీం మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిలో ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ మున్ని, గుంటూరు జిల్లా కాపు సంఘం సాధికార చైర్మన్, రామిని శెట్టి. హనుమంతు రావు. మంగళగిరి మండల అధ్యక్షులు టి.కృష్ణ చౌదరి, మంగళగిరి సీనియర్ కాంగ్రెస్ నాయకులు జె.జాన్ బాబు, బి సమర్పణ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

నవంబర్ 26రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం సి కె బాలుర హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంఈఓ ఎన్. బాబు తెలిపారు. వివిధ పాఠశాల చెందిన ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, నాగార్జున, వరలక్ష్మి, యు. ఏడుకొండలు, ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొలాల్లో అంబటి మురళి పరిశీలన

ప్రజాశక్తి - పెదకాకాని

కూటమి ప్రభుత్వం ఉచిత క్రాప్ ఇన్సూరెన్స్ చేయకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోయారని పొన్నూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెదకాకానిలో తుపానుకు నీట మునిగిన పంట పొలా లను పరిశీలించారు. అపరాల పంటలు మొలక దశలోనే తుపాను వల్ల ముంపునకు గురై, ఉడకెత్తడం వల్ల రైతులు పంట నష్ట పోయారని, పెట్టుబడి కోసం చేసిన అప్పు పెనుభారంగా మారి రైతు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందనీ, ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నారు. మండల వైసీపీ అధ్యక్షులు ఎం. మల్లికార్జున రెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు గోళ్ళ జ్యోతి,పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండలంలోని పాలపర్రు, రాజుపాలెం గ్రామాలలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగాప్రజల వైద్య ఆరోగ్య భద్రత కోసం కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైసిపి మండల కన్వీనర్ షేక్ కాసిం పీరా ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రతిపాడు వైసిపి ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చెరుకూరి సాంబ శివరావు, జంపని సంజీవరావు, దివ్వి రాంబాబు పాల్గొన్నారు.

332వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 332 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను నాయకులు కే స్టీవెన్, షైక్ సుభాని, బి.అంకయ్య, ఎం.గురవయ్య, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షల్లో మరియమ్మ, పోతంశెట్టి. వెంకటరత్నం, వేమురిబ్యా, మొలకశారదా, డిరమణ కూర్చున్నారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, వై.సాంబశివరావు, బి.సూర్యప్రకాష్, పి.హనుమంతరావు, బి ఏసోబు,శారమ్మ, దుర్గాభవాని,డి. నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న సిమెంటు కార్మికులు

నీటిని శుద్ధి చేసే క్లోరిన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

ప్రస్తుత తుపాన్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు కలుషితమై డయేరియా టైఫాయిడ్ వాంతులు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డ్రైవర్స్ కాలనీ యుపిహెచ్‌సి ప్రధాన వైద్యులు డాక్టర్ మానస మంజరి తెలిపారు. దీని దష్టిలో పెట్టుకుని నీటిని శుద్ధి చేసే క్లోరిన్ మాత్రలను తాడేపల్లి పట్టణంలోని డోలాస్ నగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పంపిణీ చేశారు. ఒక్కో మాత్ర 10లీటర్ల నీటిలో కలిపి రెండు గంటల అనంతరం తాగాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన మంచినీటిని తాగాలని కోరారు. డ్రైవర్స్ కాలనీ హెల్త్‌అసిస్టెంట్ జయరాజు, డోలాస్ నగర్ సచివాలయ ఆరోగ్య కార్యకర్త శశి, మలేరియా సబ్‌యూనిట్ నుండి సుధీర్, శంకర్ రావు ఆశా కార్యకర్త మరియకుమారి పాల్గొన్నారు.



మాత్రలు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి

ప్రజాశక్తి - తాడికొండ

పాముకాటుకు వ్యవసాయ కూలి మృతి చెందిన ఘటన మండలంలోని బండారుపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండారు పల్లి గ్రామానికి చెందిన మర్రిపూడి రమేష్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే వర్షాలకు నేలకొరిగిన పత్తి మొక్కలను నిలబెట్టే క్రమంలో పాము కాటుకు గురైయ్యాడు. స్పృహ తప్పి పడిపోయిన రమేష్‌ను తోటి కూలీలు గమనించి చికిత్స నిమిత్తం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్ప టికే రమేష్ మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోజి తెలిపారు.



మర్రిపూడి రమేష్

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - తాడికొండ

రహదారి ప్రమాదంలో యువకునికి గాయలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్ఐ జోజి తెలిపిన వివరాల ప్రకారం పొన్నెకల్లు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి (24) తాపీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 27 వ తేదీన రావేల గ్రామానికి పని నిమిత్తం వెళ్ళి సాయంకాలం తన ద్విచక్ర వాహనాంపై పొన్నెకల్లు గ్రామానికి వస్తుండగా రావేల శివారు పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తలకు బలమైన గాయమైంది గమనించిన స్థానికులు జిజిహెచ్ చికిత్స నిమిత్తం తరలించారు అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్యా, కుమారులు ఉన్నారు. మృతుని భార్య షేక్ అనూష బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలో తుపాను వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలో వేములూరుపాడు, నుదురుపాడు, కండ్రిక గ్రామాల్లో 30 మంది నిస్సహాయుకులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సారథ్యంలో తహశీల్దార్ జె. ప్రసాదరావు, మండల టిడిపి నాయకులు కలిసి 25కిలోల బియ్యం, కంది పప్పు, శనగ నూనె, ఉల్లిపాయలు, కూరగాయలు పంపిణీ చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు మండవ నరసింహారావు, కొత్తపల్లి కోటేశ్వరావు, నుదురుపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు అంబటి ఇమ్మానుయేలుపాల్గొన్నారు.

వ్యాధులను అరికట్టేందుకే ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - ఫిరంగిపురం : వర్షాలు కారణంగా పారిశుధ్య లోపాలు వలన సంభవించే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకే ప్రతి శుక్రవారం ప్రభుత్వ సూచనల మేరకు ఫ్రైడేడ్రైడ నిర్వహిస్తున్నట్లు నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు యాని గ్రేస్ అన్నారు. ప్రజల నివా సాల మధ్య నీటిని నిల్వ ఉంచడం వలన మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడతా రని అన్నారు. రోడ్లు, కాలువలను రోజూ శుభ్రం చేయాలని చెత్త కనిపించకుండా డం పింగ్ యార్డుకు ఎప్పటి కప్పుడు తరలించుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో విహెచ్ఈ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. సిబ్బంది, పంచాయతీల అధికారులు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ జె ప్రసాదరావు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మేరికపూడి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహశీల్దార్ మాట్లాడుతూ రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కల్పించింద అన్నారు. గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు

ప్రజాశక్తి - తుళ్లూరు

తుపానుకు దెబ్బతిన్న పత్తి పంట సస్యరక్షణకు రైతులు చర్యలు చేపట్టాలని ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని పెద పరిమి, వడ్డమానులో తుఫాన్ కారణంగా నీట మునిగిన పత్తి చేలను శాస్త్రవేత్తల బృందం మండల వ్యవసాయాధికారిణి పి.సంధ్యారాణి, రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం పత్తి పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ ప్రతిభాశ్రీ, డాక్టర్ ఎస్ వి ఎస్ గోపాల స్వామి, లాం ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ మనోజ్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

జంగాల బాబు s/o జంగాల సాల్మన్. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన నా యెక్క Registered document No. 2378/2011 న పిడుగురాళ్ల సబ్ రిజిస్టర్ ఆఫీసు వారిచే రిజిస్టర్ కాబడిన original documents ను తీసుకొని ది. 18-10-2025 నేను గుంటూరు వెళ్ళేందుకు పీడగురాళ్ళ లోని బస్టాండులో బస్సు ఎక్కి కొండమోడు వెళ్లేసరికి డాక్యుమెంట్ పత్రాలు ఉన్న సంచి పోయినది. కావున మీకు ఏ వ రికైనా సదరు Document No. 2378/2011 పత్ర లు దొరికిన ఈ క్రింది సెల్ నెం. 7989320687 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు.

పేరు మార్పు ప్రకటన

గుంటూరుజిల్లా, మేడికొండూరు మండలం, పేరేచర్ల గ్రామానికి చెందిన పొత్తూరు షేక్ మస్తాన్‌వలి తండ్రి : చిన హసన్ అను నా పేరు గతంలో ఆధార్‌కార్డు లేనప్పుడు తప్పుగా నమోదయింది. ప్రస్తుతం ఆధార్ కార్డు వచ్చిన తర్వాత నా పేరు సరి చేసుకొని కొత్తగా **షేక్ పొత్తూరి మస్తాన్‌వలిగా** మార్చుకోవటం జరిగినది. యావన్మంది ప్రజలు గమనించగలరు.

ఇట్లు
షేక్ పొత్తూరి మస్తాన్ వలి
పేరేచర్ల గ్రామం.

IN THE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE: GUNTUR OS. NO.544/2019

Between:
Buchipudi Rami Reddy, s/o. Subba Reddy, Ravipadu Road, Narasaraopet, Previously Guntur District, Presently Palnadu District ... Plaintiff

AND

Pedapudi Vidyadhara Srinivasa Chakravarthy, S/o.Venkata Ratnam Vidya Nagar, Near Sai Baba Temple, Guntur City ... Defendant

సదరు పత్రిక ప్రకటన మూలముగా తెలియపరచునది సదరు పైన ఉదహరించిన ప్రతివాదికి ఎన్ని పర్యాయములు సదరు పైన ఉదహరించిన చిరునామాకు దావా సమనులు శ్రీ కోర్టు వారి ద్వార పంపించినను, మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించినను అమలు కాకపోవుటము మూలముగా శ్రీ కోర్టు వారు substituted service క్రింద ఉత్తర్వులు మంజూరు చేసి ఉన్నారు గాన ఈ పత్రిక ప్రకటన ఇవ్వడమైనది సదరు ప్రతివాది ఈ ప్రకటన చూసి శ్రీ కోర్టు వారి ఎదుట ది.03.12.2025 తేదిన ఉ.10.30 గంటలకు హాజరు కావలసినదిగా ఈ ప్రకటన మూలముగా తెలియపరచుటమైనది.

From: IV ADDL. JUNIOR CIVIL JUDGE COURT GUNTUR

IN THE COURT OF THE VTH ADDL. JUNIOR CIVIL JUDGE, GUNTUR O.S. 682/2022

Between :
Punjab National Bank (Formally United Bank of India, Patnam Bazaar Bank, Guntur. Rep by Asst. Manager .... Plaintiff

and

1) Nanduri Venkata Lakshmi W/o Kameswara Rao, Dr. No. 3-84-1, Etukuru, Near Sai Baba Temple, Guntur.
2) Palakayala Dhanamma W/o Venkateswara Rao, Dr. No. 1-130, Inavolu, Tadikonda Mandal, Guntur District. .... Defendents

సదరు పత్రిక ప్రకటన మూలంగా తెలియపరచునది శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు సదరు పైన ఉదహరించిన అడ్రసులకు దావా సమనులు పంపించినను అమలు కాకపోవుట మూలంగా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా కూడా అమలు జరగకుండుట మూలంగా సమనులు అమలు నిమిత్తం సబ్‌స్టిట్యూట్ సర్వీసు క్రింద ఉత్తర్వులు మంజూరు చేసివున్నారు. గాన ఈ పత్రిక ప్రకటన ఇవ్వటమైనది. ఈప్రకటన చూసి శ్రీ కోర్టువారి యెదుట మీరు ది. 7-11-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు హాజరు కావలసినదిగా ఈ ప్రకటన మూలంగా తెలియపరచడమైనది.

Vth Addl. Junior Civil Judge, Guntur

పేపరు ప్రకటన

IN THE COURT OF THE PRINCIPAL 1ST ADDL. JUNIOR CIVIL JUDGE, SATTENAPALLI O.S. 390/2023

Between:
Dondeti Ramanamma @ Pothireddy Ramanamma .... Plaintiff

Vs

1) Dondeti Venkateswara Reddy
2) Dondeti Ramana Reddy ... Defendants

To,
Dondeti Venkateswara Reddy S/o Rami Reddy, Kondamodu Village, Rajupalem Mandalam, Piduguralla JCJ., Palnadu Dist.

పై నెంబరుగల దావాలో మీరు మొదటి ప్రతివాదియై వున్నారు. మీకు ఈ దావాలో వాది ఎన్నిసార్లు మీకు దావా సమన్లు పంపినను కావాలనే దురుద్దేశ్యంతో తీసుకొనకపోవుట వలన, పై కోర్టువారు మీకు ఈ పేపరు పబ్లికేషన ద్వారా మీకు ఈ కేసులో దావా సమన్లు జారీ చేసివున్నారు. వాయిదాతేది : 28-11-2025 కనుక మీరు కానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరయి మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మిమ్ములను పరోక్షంగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:28-11-2025

జి.సుధీర్‌కుమార్
అడ్వకేట్,
నరసరావుపేట - 522601
పల్నాడుజిల్లా.

NOTICE
IN THE COURT OF THE I ADDL.DIST. JUDGE:: GUNTUR M.V.O.P.No.1225/2023

Between:
Bulla Raghava Rao .... Petitioner

And

Royalabison autorentals India Pvt.,Ltd. & Others ..... Respondents

To,
R-3 : Chandu Bhanu Prakash, S/o. Srinivasa Rao, R/o. D.No.1-5, Srinivasaraopeta 100 Ft Road, Beside Suguna Chicken Shop, Guntur.

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనరు యాక్సిడెంటులో తనకు తగిలిన దెబ్బలుకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటిషనులో 3వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.03-11-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:03-11-2025

వలివేటి నాగేశ్వరరావు,
పిటీషనరు తరపు అడ్వకేట్,
కన్నా వారి తోట 5వలైను, గుంటూరు.

GENERAL NOTICE
IN THE COURT OF THE PRL.DIST. JUDGE :: GUNTUR G.W.O.P. No. 1461 / 2025

Between:
Shaik Nagur Bi, W/o.Shaik Basha, R/o.D.No.13-64, A.T.Agraharam, 15th line, Guntur-522004. .... Petitioner

And

Nil ....Respondents

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనరు తన మైనరు కుమారుడు అయిన షేక్ మస్తాన్ వలి యొక్క విద్యా బుద్ధులు, బాగోగులు, పోషణ వగైరాలు కొరకు మైనరు తాలూకు వాటా ఆస్తిని అమ్ముటకు పర్మిషన్ కొరుచూ దాఖలుచేయగా సదరు పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉంటే తెలుపుకొన వలసినదిగా కొరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **ది.20-11-2025**కి వాయిదావేసినారు. కావున వాయిదారోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట హాజరై వారికిగల ఆక్షేపణలు, అభ్యంతరములు తెలుపుకొనగలరని యావన్మందికీ తెలియజేయడమైనది.

Schedule: Guntur Dt, Nallapadu Sub-Dt, Anki Reddypalem(V)Panchayati to Guntur New Municipal Corporation Area, Ankireddypalem (V), D.No. 634/2, to an extent of 45 sq.yards with Asst. No.406, Door No.3-135 of Thatched house is being bounded by; **East:** Property of Nelaturi Peddabalaiah; **South:** Property of korivi Bala Kotamma; **West:** 5 feet width Bazar; **North:** Property of Ambothula Lakshmamma, Within these boundaries an extent of 45sq.yards or 37.62sq.meters of Thatched house with all fixture.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:20-11-2025.

రవీంద్ర కుమార్ రామరాజు,
పిటీషనరు తరపు అడ్వకేట్,గుంటూరు,సెల్: 91773 69169



ఇళ్లెదుట మురుగు నీరు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని నరుకుళ్లపాడులో ఇళ్లెదుట రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండడంపై ప్రజాశక్తిలో శుక్రవారం వార్త ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించారు. ఆ ప్రాతంలో కచ్చా డ్రెయిన్‌ను తీయించి మురుగు నీటిని బయటకు పంపించారు. పనులను పంచాయతీ అధికారులు, కూటమి పార్టీ నాయకులు పర్యవేక్షించారు.



వాలీబాల్ జిల్లా జట్టుకు ఎనిమిది మంది చైతన్య పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

వాలీబాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు పెదకూరపాడులోని చైతన్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎనిమిది మంది ఎంపికయ్యారు. పెదకాకాని మండలం నంబూరు జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం జరిగిన ఎంపికల్లో అండర్-17(బాయ్స్-గర్ల్స్) జట్టుకు బాలికల విభాగంలో ఐదుగురు ప్రధాన జట్టుకు, ఒకరు స్టాండ్‌పైగా ఎంపికైనట్లు చైతన్య పాఠశాల డైరెక్టర్ రావు రాము తెలిపారు. ఎంపికైన వారిలో సాదినేని నేహా, వేముల లక్ష్మీరేణు, దుర్గాక్షర, మువ్వా స్వప్న, వేముల చరిత, ధరణి (స్టాండ్ బై) ఉన్నారు. బాలుర విభాగంలో దుల్ల బ్రహ్మం, అనుముల వరుణ్ కుమార్ ఎంపికయ్యారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

వాలీబాల్ అండర్-17 విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు మండలంలోని లింగారావుపాలెం జెడ్‌పి పాఠశాల విద్యార్థి బోరుగడ్డ సుమన్ ఎంపికైనట్లు హెచ్‌ఎం కెవి రామిరెడ్డి, పిఇఇ మేరిశౌరీ తెలిపారు. ఎంపికైన వారు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు.



లాడ్జీకొచ్చే అందరి వివరాలూ ఇవ్వండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

లాడ్జీల్లో సీసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ ఆదేశించారు. సత్తెనపల్లి పట్టణంలోని లాడ్జి నిర్వాహకులు, మేనేజర్లతో ఎస్ఐ శుక్రవారం సమావేశమయ్యారు. లాడ్జిలో రూమ్ తీసుకున్న ప్రతి ఒక్కరి గుర్తింపు కార్డులు, ఇతర వివరాలు తీసుకోవాలని చెప్పారు. జూదం, మద్యం పానం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు లాడ్జీలను వేదిక చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు గదులు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు 7 గంటల వరకు లాడ్జిలో దిగిన వారి పూర్తి సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు ఇవ్వాలన్నారు.

ఎకరాకు 8 క్వింటాళ్ల పత్తిపంట నష్టం

ప్రజాశక్తి - యడ్లపాడు



యడ్లపాడు మండలంలో దెబ్బతిన్న పత్తిపైరు

మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో భారీగా పంట నష్టం వాటిల్లిందని, కాపు మీద ఉన్న పత్తి కాయలు కుళ్లిపోయాయని చెప్పారు. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావించినా రెండు మూడు క్వింటాళ్లకు మించేలా లేదని, యడ్లపాడు మండలంలో 12 వేల ఎకరాల్లో పత్తి వేయగా సుమారు 7500 వేల ఎకరాల పత్తి పంట దెబ్బతిన్నట్లుగా అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఉన్నవ, యడ్లపాడు, నాదెండ్ల, తిమ్మాపురం, గణపవరం గ్రామాల్లో దెబ్బ తిన్న పంట పొలాలను రైతు సంఘం మండల కార్యదర్శి కల్లూరి రామారావు, శ్రీనివాసరెడ్డి, నూతలపాటి సుబ్బరామమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి రైతులకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఉన్నవ గ్రామంలో పంట నష్టం నమోదు చేస్తే పత్తిని సిసిఐలో అమ్ముకోవడం సాధ్యం కాదని వ్యవసాయ అధికారులు అంటున్నారని చెప్పగా అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి మాట్లాడారు. నష్టం నమోదుకు సిసిఐ కొనుగోళ్లకు సంబంధం లేదని నిర్ధారించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ రెండవ విడత సహాయం రూ.7 వేలు వెంటనే ఇవ్వాలని, కౌలు రైతులకు ఒకే విడత రూ.20 సహాయం అందించాలని కోరారు. పంట నష్టపరిహారం గతంలో ఏ పంటకైనా 10 వేలు మాత్రమే ఇస్తున్నారని, వాణిజ్య పంటల పెట్టుబడులు పెరగడం, ఎక్కువ మంది కౌలు రైతులకు పంట రుణాలు బ్యాంకులు ఇవ్వకపోయినా ప్రైవేటు రుణాలపై ఆధారపడి సాగు చేస్తున్న నేపథ్యంలో ఎకరాకు కనీసం రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. పంటల బీమా అమలును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, బీమా ప్రీమియం చెల్లించి ఉంటే ఇప్పుడు రైతులందరికీ ఉపయోగం జరిగేదని చెప్పారు. ఎక్కువ మంది కౌలు రైతులు బీమాలో లేక పోవడంతో వాతావరణ బీమా గాని, దిగుబడుల ఆధారిత బీమా గాని అందక అప్పుల పాలై కోలుకోలేక పోతున్నారని అన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంకా లబ్ధిదార్ల జాబితాను ప్రకటించలేదన్నారు.



అధికారుల తీరుతో రైతులకు నష్టం

ప్రజాశక్తి - మాచర్ల

తుపాను వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి బండ్ల మహేష్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. పట్టణ శివారులో తుపాను కారణంగా దెబ్బతిన్న పంటపొలాలను సిపిఎం నాయకులు, శుక్రవారం పరిశీలించారు. కౌలు రైతులను ఆదుకోవాలని, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాధికారులు పంటల నష్టాన్ని హడావిడిగా సేకరింస్తున్నారని, దీని వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. తడిసిన పంటలను ప్రభుత్వమే కొనాలన్నారు. పరిశీలనలో నాయకులు బండారు శ్రీను, జయరావు, ఆవుల వెంకటేశ్వర్లు, దేవినేని లింగయ్య పాల్గొన్నారు.

చనిపోయిన గొర్రెలకు రూ.10 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలి : జిఎంపిఎస్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

తుపాను ధాటికి వర్షాలు, చలిగాలులతో చనిపోయిన గొర్రెలు మేకలకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జిఎంపిఎస్) రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకటరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నాయకుడు తిక్కా నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సంఘం సమావేశం జరిగినది. వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గొర్రెలు మేకలు సంఖ్యకు అనుగుణంగా అన్ని పశు వైద్యశాలల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, పశు వైద్యశాలలో, రైతు సేవా కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జీవాలు వ్యాధుల బారినపడి చనిపోకుండా సకాలంలో టీకాలు అందించాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ఆంజనేయులు మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ నిధుల ద్వారా గొర్రెల మేకల పెంపకందారులు అందరికీ షెడ్లను నిర్మించాన్నారు. నవంబర్ 19,20 తేదీల్లో మాచర్లలో జరిగే సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎన్.శివరామయ్య, వై.చిన్న వెంకయ్య పాల్గొన్నారు.


విలీన గ్రామాల్లో అభివృద్ధి లేమిపై కౌన్సిల్లో విమర్శలు



కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మున్సిపాలిటీలో విలీన గ్రామాల అంశం మున్సిపల్ సమావేశంలో తీవ్ర చర్చకు దారి తీసింది. వాదనలు, పరస్పర నిందారోపణలతో కౌన్సిల్ హాల్ దద్దరిల్లింది. చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విలీన గ్రామాలు ఐదేళ్లుగా అభివృద్ధికి నోచలేదని, తమ గ్రామమైన గణపవరం అభివృద్ధి చెందుతుందని భావించినా ఏమీ జరగలేదని అన్నారు. టిడిపి కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు జోక్యం చేసుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జెడ్పీ నిధులతో ఎన్నో పనులు జరుగుతున్నాయని చెప్పారు. పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి స్పందిస్తూ వైసిపి హయాంలో విడదల రజిని మంత్రిగా ఉండికూడా పురుషోత్తమపట్నాన్ని అభివృద్ధి చేసుకోలేక పోయారని విమర్శించారు. దీంతో వైసిపి, టిడిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం తలెత్తింది. అనంతరం కొనసాగిన చర్చలో... కమిషనర్ పి.శ్రీహరిబాబు మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో పట్టణం ముందజలో ఉన్నా విలీన గ్రామాల నుంచి ఐదేళ్లుగా పన్నుల వసూలు లేనికారణంగా వెనకబడ్డామని చెప్పారు. దీనివల్ల భవిష్యత్‌లో ఆర్థిక సంఘం నిధులు కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించి సమావేశాన్ని ముగించారు.



8 గేట్ల ద్వారా నీటి విడుదల


ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి 95.389 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో శుక్రవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,632 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటి మట్టం 589.80 అడుగుల వద్ద ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 2053 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,704 క్యూసెక్కులు, మొత్తం ఔట్ ఫ్లోగా 95,389 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

విద్యుత్ ప్రాజెక్టును సందర్శించిన విద్యుత్ సౌధ సీఈ

ప్రజాశక్తి - రెంటచింతల

సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును విద్యుత్ సౌధ హైడల్ ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజినీర్ విశ్వేశ్వరరావు, ఈఈ హరినాథ్ శుక్రవారం సందర్శించారు. తొలుత రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి జరిగే ఎంసీఆర్ (మెయిన్ కంట్రోల్ రూమ్)ను పరిశీలించారు. ప్రస్తుతమున్న బ్యాటరీ బ్యాంక్‌కు అదనంగా మరొకటి ఏర్పాటు చేయాలని ఇంజినీర్లు కోరారు. ప్రాజెక్టు నిర్మాణం సమయంలో రెంటచింతల సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ ఉపయోగించారని, దానికి సంబంధించిన రూ.30 లక్షల విద్యుత్ బిల్లుల



బకాయిల విషయాన్ని సీఈ దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారుల ఆమోదంతో సమస్యను పరిష్కరిస్తామన్నారు. కరెంట్ తయారీ అనంతరం టేల్‌రేస్ ఛానల్ ద్వారా ఇప్పటి వరకు 45 టీఎంసీల నీటిని పులిచింతలకు విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్, ఈఈలు నాగరాజు, సుబ్రహ్మణ్యం, ఏడీఈలు గిరిబాబు, జయశంకర్, మహ్మద్, మల్లేష్, వెంకటరమణ, శ్రీలత, సుబ్బారావు పాల్గొన్నారు.



అజాద్‌నగర్ లోలెవల్ చప్టా

చంద్రవంక ధాటికి కొట్టుకుపోయిన చప్టాలు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణం గుండా ప్రవహించే చంద్రవంక వాగు ఉధృతికి లోలెవల్ చప్టాలు కొట్టుకుపోయాయి. మొంథా తుఫాన్ కారణంగా మాచర్ల పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలకు చంద్రవంక వాగు పొంగిపొర్లింది. పట్టణం నండి జమ్మలమడకకు, అజాద్ నగర్‌కు వెళ్లే దారిలో చంద్రవంక వాగుపై రెండు లోలెవల్ చప్టాలు వాగు ఉధృతికి కొట్టుకుపోయాయి. అజాద్ నగర్‌కు వెళ్లే దారిలో చప్టాకొట్టుకుపోవటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినాయకునిగుట్ట, అజాద్‌నగర్ ప్రజలు పట్టణంలోకి వచ్చేందుకు ఎంతో ఉపయోగకరమైన చప్టా కొట్టుకుపోవటం వలన అవస్థలు పడుతున్నారు. మాచర్ల నుండి జమ్మలమడక దారిలోని లోలెవల్ చప్టా కూడా తీవ్రంగా దెబ్బతింది. జమ్మలమడక, లింగాపురం, తమ్మకోట గ్రామాలకు ఈ దారి గుండానే వాహన రాకపోకలు సాగుతుంటాయి. ఈ చప్టాను తాత్కాలికంగా కొట్టుకుపోయిన దిమ్మెలను సరిచేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. కొట్టుకుపోయిన బ్రిడ్జిలను మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, కమిషనర్ వేణుబాబు పరిశీలించారు. భారీ వాహనాలు వస్తే ఇబ్బందని, వెంటనే ఈ రెండు లోలెవల్ చప్టాలను పెద్ద బ్రిడ్జిలుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతుల దశలో జమ్మలమడక లోలెల్ చప్టా


చిర్రావూరు, కొల్లిపర మండలంలో తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రూ.25వేలు నష్టపరిహారం అందించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు,

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మొంద తుఫాను వలన నష్టపోయిన వరి రైతులను ఆదుకునేందుకు ఎకరాకు 25000 రూపాయలు పంట నష్ట పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుపాను ప్రభావానికి దెబ్బతిన్న ఆయా పంటలను ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ మొంథా తుపాను వల్ల మండలంలోని వివిధ గ్రామాలలో వ్యవసాయ పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి పంట వేసిన రైతులు అకాల భారీ వర్షాల వలన, ఇప్పటికి రెండుసార్లు నష్టపోయారని అన్నారు. దిగుబడులు తగ్గి, తెగుళ్లతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకునే విధంగా నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు అందచేయాలన్నారు. అరటి , పసుపు, కంద ఆకుకూరల రైతులు నష్టపోయారన్నారు. ఈ ప్రాంతంలో పంట పొలాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేనందున ఎక్కడి వర్షపు నీరు అక్కడే పొలాలలో నిలిచిపోయి, పంటలు దెబ్బతిన్నాయన్నారు. రోజుల తరబడి వర్షపు నీరు పంట పొలాలలో నిలిచిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. అధికారులు స్పందించి పూడిక తీయించాలని, రైతుల పంటలు కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు బప్పన గోపాలరావు, కౌలు రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు, మొక్కపాటి అశోక్, మొక్కపాటి వెంకట్రావు, పమిడిశెట్టి రాజా, అడప సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలకు ఎకరాకు 50 వేల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కొల్లిపర

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన ఉద్యాన పంటలకు ఎకరాకు 50వేల రూపాయలు పరిహారంగా ఇవ్వాలి అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కౌలు రైతుల సంఘం మండలనాయకులు జిలుగు ముక్కంటితో కలిసి దావులూరిపాలెం, హనుమాన్‌పాలెం గ్రామాల్లో పర్యటించారు. బాధితులను కలసి వివరాలు తెలుసుకున్నారు. అరటి పసుపు కూరగాయ తోటలు భారీ వర్షాలు గాలులకు పంటలు దెబ్బతిన్నాయని రైతులు తమ ఆవేదన వ్యక్తంచేశారు. తుపాను దెబ్బకు అరటికి పెట్టిన బొంగులు కూడా విరిగి పోయాయని అన్నారు. లక్షరూపాయలు నష్టం వాటిల్లింది అని రైతులు వాపోయారు. రెండు నెలలుగా వానలు బాగా పడుతుండటంతో నేల ఆరక పోవటం రోజులు తరబడి నీరు నిల్వ ఉండటం వల్ల పసుపు పంట పుచ్చు వచ్చే ప్రమాదం ఉందని దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కందకు పిలకలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కొల్లిపర మండలంలో సుమారు 500 ఎకరాల్లో అరటి దెబ్బ తిందని ప్రభుత్వం ప్రభుత్వం వెంటనే ఎన్యుమరేషన్ చేసి రైతులకు ఎకరానికి 50,000 పరిహారం ఇవ్వాలని కోరారు. వాణిజ్య పంటలు సాగు చేస్తున్న కవులు రైతులకు భూ యజమాని తో సంబంధం లేకుండా నేరుగా వారి ఖాతాలోనే నష్టపరిహారం జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెదకాకాని

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. మండలం పరిధిలోని ఉప్పలపాడు రామయ్య కాలనీలో శుక్రవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ సమావేశం వర కుమారి అధ్యక్షతన జరిగింది. శివాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, యూనిఫామ్, గ్యాస్, వంట సామాగ్రి ఇవ్వాలని, వేసవి సెలవులు, మెడికల్ లీవులు, తల్లికి వందనం ఇవ్వాలని కోరారు. హెల్పర్లకు 7000 జీతం అయితే ఆన్‌లైన్‌లో 12 వేల రూపాయలు తీసుకుంటున్నట్లు వస్తోందని దీనివల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సచివాలయాల్లో సరి చేయమని అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రాజా రమేష్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.కనకవల్లి, పి.భాగ్యలక్ష్మి, కె.పావని, అంజనాదేవి, హిందు వాణి, షేక్ ముంతాజ్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలపాడులో మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ, దుగ్గిరాలలో మాట్లాడుతున్న జెట్టి బాలరాజు

దుగ్గిరాలలో..

ప్రజాశక్తి - దుగ్గిరాల

అంగన్‌వాడీలు 45 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం చేసిన ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని సిఐటియు మండల ఉపాధ్యక్షులు జెట్టి బాలరాజు అన్నారు. స్థానిక అంగన్‌వాడీలో సెక్టార్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు, డిసెంబర్ 31 నుండి 2026, జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా మహాసభల్ని జయప్రదం చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు పనిచేయని ఫోన్లు ఇచ్చి ఇబ్బందులు పెడుతునారని చెప్పారు. కొత్త ఫోన్లు ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కనీస వేతనం అమలు కావడం లేదని ధరలు కుటుంబ పోషణ ఖర్చులు పెరిగిపోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో శివ పార్వతి, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, అఖిల, సునీత పాల్గొన్నారు.

సామినేని రామారావు హత్యకు ఖండన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి సామినేని రామారావును గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం, పాతర్ల పాడులో దుండగులు హత్య చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం బైపాస్ వద్ద ఉన్న కేబీ భవన్‌లో రామారావు హత్యను ఖండిస్తూ రైతు సంఘం నాయకులు సంతాపం తెలిపారు. రామారావు తన స్వగ్రామమైన పాత్రలపాడులో గ్రామపంచాయతీ సర్పంచ్‌గా రెండుసార్లు ఎన్నికై, ప్రజల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పనిచేశారని అన్నారు. మౌలిక సమస్యల పరిష్కారం కోసం, గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కే ప్రభాకర్ రెడ్డి , రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అన్నారు. రామారావు మృతి రైతు పోరాటాలకు, ఉద్యమానికి తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వర్షపు నీరు తొలగించాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి


వినతిపత్రం అందజేస్తున్న పేదలు

ఇళ్లల్లో నీళ్లను తొలగించాలని కోరుతూ శుక్రవారం ఎర్రబాలెం స్పెన్సర్, శర్మ డాబా వద్ద ఉన్న పేదలు మంగళగిరి కార్పొరేట్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల పేదలు ఇళ్లు వేసుకుని నివసిస్తున్నామని, తుపాను వల్ల కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు వచ్చి అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.దుర్గంధం వెదజల్లుతుందని విన్నవించారు. పాములు, పురుగులు ఇళ్లలోకి వచ్చి భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించి, నిల్వ ఉన్న మురుగునీటిని బయటకు పంపించాలని విన్నవించారు. స్పందించిన అధికారులు వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవడానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.రవి, రైతు సంఘం నాయకులు ఎ.వీరవెంకయ్య, కె.వరలక్ష్మి, ఎ.బుజ్జి, కె.ప్రశాంతి, కె.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుండా భూసేకరణ చేయరాదు : రామకృష్ణ


ప్రజాశక్తి - మేడికొండూరు


మాట్లాడుతున్న రామకృష్ణ

రైల్వే శాఖ నువ్వు సేకరణ యాక్టివ్ అమలు చేసేందుకు తీసుకోవాల్సిన నిబంధనలు పాటించకుండానే గ్రామాలలో భూ సేకరణ చేయరాదని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బోట్ల రామకృష్ణ తెలిపారు. నడికుడి - గుంటూరు రైల్వే నూతన లైను భూ సేకరణలో నివాసాలు కూల్పోతున్న బాధితుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఒక్క సిరిపురం గ్రామంలోనే నూతన రైల్వే మార్గం వేసేందుకు స్థానికంగా ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలలో 30 మంది బాధితులు ఉన్నారని తెలిపారు. మొదట నిర్వాసితులతో గ్రామసభ నిర్వహించి ఆమోదంతో తర్వాత మండల కేంద్రంలో వినతి పత్రాలు సేకరించాలి అని అన్నారు. రైతుల భూమి 25 ఎకరాలు, పేదవారి ఇల్లు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్నవారు, నిరుపేద మధ్యతరగతి కుటుంబాల వారు ఉన్నారని అన్నారు. 30 మంది పేదల ఇల్లు కోల్పోయేవారితో గ్రామసభలో 70 శాతం ఆమోదం తీసుకోవాలన్నారు. రైల్వే లైన్ నిర్మాణంలో భూమి కోల్పోతున్న నిర్వాసితులు గ్రామంలో 80 మంది వరకు ఉన్నారు అని అన్నారు. బాధితులందరికీ న్యాయమైన నష్టపరిహారం రైల్వే శాఖ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం అందేదాకా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రతి సోమవారం జరొడే కలెక్టర్ స్పందనలో వినతి పత్రం ఇచ్చే విధంగా సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే శాఖ భూసేకరణ బాధితుల, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఏఈ నాగమల్లేశ్వరరావు తండ్రి మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్


ఆంజనేయులు (ఫైల్)

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన ఏఈ నాగమల్లేశ్వరరావు తండ్రి నారం శెట్టి ఆంజనేయులు (78) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆంజనేయులు ఏకైక కుమారుడు నారం శెట్టి నాగమల్లేశ్వరరావు ఏఈ గా తాడేపల్లి మండలంలో పనిచేశారు. ప్రస్తుతం తాడికొండ మండలంలో ఏఈ గా నాగమల్లేశ్వరరావు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆంజనేయులు మృతి వార్త తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు శుక్రవారం ఆంజనేయులు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం గ్రామ కార్యదర్శి బొప్పన గోపాలరావు, మార్కెట్ యార్డ్ మెంబర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి, టిడిపి నాయకులు ఉన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మొంథా తుపాను వల్ల నిలువ నీడ లేక, పనులు కోల్పోయిన 51 కుటుంబాలకు వడ్డేశ్వరంలోని రేషన్ షాపు వద్ద టిడిపి నాయకులు శుక్రవారం నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రహ్మణ్యం, వీఆర్‌వో సుభాషిని భాయి, గుంపిన నాగేశ్వరరావు, షేక్ ఇమాంస, వడ్డేశ్వరం బాబురావు, రేషన్ డీలర్లు గుంపెన మహాలక్ష్మి, మేకల శివ నాగేంద్రం లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించండి

ప్రజాశక్తి - వెల్దుర్తి

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ అన్నారు. మొంథా తుపాన్ కారణంగా వెల్దుర్తి మండలంలోని దెబ్బతిన్న పత్తి పంటలను శుక్రవారం శాస్త్రవేత్త గోపాల్, వెల్దుర్తి వ్యవసాయాధికారి బాలాజీ గంగాధర్ కలిసి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటపొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలన్నారు. ఎకరానికి 25-30కిలోల యూరియా, 15 కిలోల పొటాషియంను కలిపి చల్లాలన్నారు. మెగ్నిషియం లోపంవల్ల ఆకులు ఎండిపోయి రాలిపోతాయని, మెగ్నిషియం సల్ఫేట్ను పిచికారి చేయాలన్నారు.వీరి వెంట వ్యవసాయ సిబ్బంది. రైతులు ఉన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పత్తి అధిక దిగుబడి వస్తుందని జిల్లా ఎన్ఎఫ్ ఏ.నందకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో రసాయన పద్ధతు ల్లో సాగుచేసిన పత్తిని, ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పత్తిని ఆయన పరిశీలించారు. మొంథా తుపాను సైతం తట్టుకొని ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పత్తి దెబ్బ తిన లేదన్నారు. రసాయన వ్యవసాయంలో చెట్టుకు 40 కాయలు ఉంటే, ప్రకృతి వ్యవసాయంలో 60కాయలు ఉన్నాయన్నారు. ఎం.టి.మధుబాబు, యూనిట్ఇన్చార్జి అమూల్య, ఐసిఆర్పి జ్యోత్స్న, ఉదయలక్ష్మి, మహబూబ్బీ, రైతులు వెంక టేశ్వర్లు, బాబ్జి పాల్గొన్నారు.

బాధితులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - రాజుపాలెం

మొంథా తుపాన్ బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచిందని తహశీల్దార్ సరోజ, ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గణపవరం, కొత్తూరు, చౌటపాపాయపాలెం, కొండమోడు గ్రామాల్లోని తుపాన్ బాధితుల కుటుంబాలకి 25కిలోల బియ్యం, కిలోఆయిల్, కందిపప్పు, పంచదార, ఉల్లిగడ్డలు, బంగాళా దుంపలు రూ.వెయ్యి పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు,ఉన్నతాధికారుల సూచనలతో తీసుకున్న ముందస్తు చర్యలతో రాజుపాలెం మండలంలో నష్ట తీవ్రతను తగ్గించగలిగామనీ తహశీల్దార్ సరోజ ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ షేక్‌జానీబాషా, మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహారావు, ముక్కంటి పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ 41వ వర్ధంతి

ప్రజాశక్తి - కారంపూడి

ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ 41వ వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగేటిఏడు కొండల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్లో నిర్వహించారు. ఏడుకొండలు మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశానికి ఎంతోసేవ చేశారని, బ్యాంకుల జాతీయకరణ, పేదరిక నిర్మూలన కొరకు 20సూత్రాలు వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి దేశ ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

సిఐగా సిహెచ్ ప్రభాకరరావు బాధ్యతలు

ప్రజాశక్తి - నరసరావుపేట

గుంటూరు రేంజ్ పరిధిలోని పలువురు సిఐలు సాధారణ బదిలీలలో భాగంగా, రేంజ్ ఐజి త్రిపాఠి ఉత్తర్వుల మేరకు నరసరావుపేట రెండవ పట్టణ సిఐగా సిహెచ్ ప్రభా కర రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నరస రావు పేటలో పని చేసిన అనుభవ దృశ్య ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విషయంలో నిక్కచ్చిగా పని చేస్తానని అన్నారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి, స్టేషన్‌కు ధైర్యంగా వచ్చేలా స్నేహ పోలీసింగ్‌కు అనుకూలం వాతావరణం ఏర్పాటు చేసి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇక్కడ పని చేసిన సిఐ హైమారావును విఆర్‌కు బదిలీ చేసారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి తహశీల్దార్ కేవస్ చక్రవర్తి అన్నారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామం లో పౌర హక్కుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే హక్కు మీకు ఉందన్నారు. పౌర హక్కుల గురించి ప్రజలకు వివరించారు. డిబిఆర్సీ కన్వీనర్ మల్లెల చినప్ప, రెవిన్యూ ఇన్స్పెక్టర్ బోస్ బాబు ఎస్సీ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

యానాదులకు ఇళ్ల స్థలాలివ్వాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కోటప్పకొండ వద్ద నివాస గృహాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్న దాదాపు 150 కుటుంబాల యానాదులు తమకు నివేశన స్థలాలు కావాలని ఎమ్మెల్యేను కోరారు. 30ఏళ్లకు పైగా ప్రభుత్వ స్థలంలో చిన్న గుడిసెలలో జీవనం సాగిస్తున్నారని ఇటీవల మొంథా తుఫాను కారణంగా గుడిసెలు, వీధులు గాలులకు చెల్లాచెదురై నిరాశ్రయు లయ్యాయని ఎమ్మెల్యే ముందు విలపించారు. వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బాధితులను వెంట బెట్టుకుని కలెక్టర్ కార్యాలయానికి వెళారు. నిరాశ్రయులైన యానాదులకు తగు న్యాయం చేయాలనీ, బాధితుల పక్షాన నిలబడి తక్షణ సహాయానికి హామీ ఇవ్వాలని కలెక్టర్ కృతికా శుక్లాను కోరారు. స్పందించిన కలెక్టర్, ప్రభుత్వంతో సంప్రదించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేచదలవాడకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వివిధ సమస్య లపై ప్రజలు ఎమ్మెల్యేకి వినతి పత్రాలు అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అర్జీ దారులకు హామీ ఇచ్చారు.

పల్నాడు జిల్లా కలెక్టర్ కలిసిన ఎమ్మెల్యే కన్నా

పల్నాడు జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృతిక శుక్లాను, జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అంద జేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి - అమరావతి

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అమరావతి సిఐ అచ్చయ్య ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి పోలీస్ స్టేషన్ పరిధిలోని బిఎస్సి నర్సింగ్ కాలేజీలో వ్యాసరచన పోటీలు, పల్లోటి కాలేజీలో సైబర్ క్రైమ్, ఉమెన్ సేఫ్టీ మరికొన్ని అంశాల మీద అవగాహన కల్పించారు అనంతరం రామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్లో పనితీరును వివరించారు.

ప్రజాశక్తి - మాచర్ల

పోలీస్ అమరవీరుల సంస్మరణదినం వారోత్సవాలను పురస్కరించుకొని పోలీసులు శుక్రవారం పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సిఐ వెంకటరమణ మాట్లాడుతూ పోలీసు విధినిర్వహణ శ్రమతో కూడుకున్నదని అన్నారు. ప్రజల భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులేనని తెలిపారు. ఎంతో మంది పోలీసులు ప్రాణాలు సైతం అర్పించారని, వారందరికి జోహార్లు అర్పిస్తు న్నట్లు చెప్పారు. ర్యాలీలో పట్టణ ఎస్ఐ అనంతకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవ అవగాహన సదస్సు

ప్రజాశక్తి - అమరావతి

సాయంత్రం సమయంలో అమరావతి మండలంలోని మల్లాది గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం అమరావతి తహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీడీవో అధికారులు, సిబ్బంది గ్రామ నివాసులు పాల్గొన్నారు.

వైసిపి నేతల పొలంబాట కార్యక్రమం

ప్రజాశక్తి - దాచేపల్లి : మండలంలోని వైకాపా నేతలు శుక్రవారం పొలంబాట కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశానుసారం తంగెడ రోడ్డులోని పొలాలలో మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన మిర్చి, పత్తి పంటలను పరిశీలిం చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. వైకాపా నేతలు కె.సాం బయ్య, జి.పుల్లారావు, ఎం.శ్రీను, ఎస్.వెంకటేశ్వర్లు, బి.శ్రీను, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం విజయభారతి

ప్రజాశక్తి - పెదకూరపాడు : కె.విజయభారతి ఉపాధ్యాయులందరికీ ఆదర్శమని యుటిఎఫ్ నాయకులు అన్నారు. మండలంలోని హస్సే నగరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసిన విజయభారతి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆమె ను యుటిఎఫ్ నాయకులు శివశంకరరావు, హషం, సతీష్ ఆధ్వర్యంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణ కు ఆమె మారుపేరు అన్నారు. డ్యూటీని అంకితభావంతో నిర్వర్తించిందని కొనియాడారు. ఉపాధ్యాయులు సిస్టర్ మేరీవిజయ, హిమని, శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - రెంటచింతల

పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన రెంట చింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్ఐ సిహెచ్ నాగార్జున చెప్పారు. 'స్త్రీలు, చిన్నారులను లైంగిక వేధింపుల నుంచి రక్షించడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై పోటీలు జరిపారు. కరస్పాండెంట్ ఫాదర్ గోవింద బాలస్వామి, హెచ్ఎం దుర్గా ప్రసాద్, వి.శ్రీనివాసరావు, అనిల్‌రెడ్డి, పాపారావు, మరియ దాస్ బంగారమ్మ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం - 2025 సందర్భంగా పల్నాడు ఎస్పి కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ, ప్రభుత్వ వైద్యశాల (లింగంగుంట్ల) వైద్యుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రజారక్షణ కొరకు పోలీసులు చేసిన త్యాగాలకు గుర్తుగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని ఎస్పి బి.కృష్ణారావు తెలిపారు. ఏఆర్ డిఎస్పి మహాత్మాగాంధీ, వెల్ఫేర్ ఆర్ఐ గోపినాథ్, అధికారులు యువరాజ్, కృష్ణ, ఎం.రాజాను ఎస్పి అభినందించారు.

గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

తన పొలంలోకి గొర్రెలు వచ్చాయనే కోపంతో వ్యక్తి గొర్రెల కాపరిపై రాయితో దాడి చేయడంతో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం చింతల తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గొర్రెల కాపరి జగ్గుపల్ల సాయితో పాటు మరో ఆరుగురు వ్యక్తులు కొన్ని రోజుల కిందట వలస వచ్చి చింతల తండా శివారులో జీవాలు కాస్తూ జీవిస్తున్నారు. శుక్రవారం చింతల తండాకు చెందిన రమావత్ బుద్ధానాయక్ తన పొలంలో గొర్రెలు ఎందుకు మేపుతున్నావని జగ్గుపల్ల సాయి(26) పైరాయి, కర్రతో దాడి చేశాడు. దీనితోసాయి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

కొనసాగుతోన్న కోటి సంతకాల కార్యక్రమం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కొనసాగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని వైసిపి పల్నాడు జిల్లా కార్య నిర్వహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో ముస్లిం మైనారిటీలు 50శాతం సీట్లు కోల్పోతారన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కులమతాలకు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ పొదిలి ఖాజా, నియోజకవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

ప్రజాశక్తి - మాచర్ల

స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ మాచర్ల ఆధ్వర్యంలో స్థానిక స్వామి వివేకానంద సేవాశ్రమంలో శుక్రవారం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ హెడ్మా స్టర్ అందుగుల చంద్రయ్య హాజరై మెట్టు గోవింద రెడ్డితో కలిసి పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందిరాదేవి, సుందరమ్మ, స్వరాజ్యం, అరుణకుమారి, మంగమ్మ, నారాయణరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని లగడపాడులో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉక్కు మనిషిసర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నండూరి సురేష్, సహ ఉపాధ్యాయులు పాటిబండ్ల శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులందరికి పెన్నులు బహుకరించారు.



పనులు పరిశీలిస్తున్న తహశీల్దార్

తహశీల్దారు కార్యాలయంలో ఆధునిక పనులు

ప్రజాశక్తి-దాచేపల్లి

దాచేపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు తహశీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షాలకు కార్యాలయం కారుతుందని చెప్పారు. కార్యాలయంలో మరి కొన్ని పనులు చేపట్టవలసి ఉందన్నారు. ఆధునీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయవలసిందిగా కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు తహశీల్దార్ తెలియజేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - మాచర్ల

అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని మాచర్ల పట్టణ సిఐ వెంకటరమణ, ఎస్సై అనంతకృష్ణ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. సిఐ వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారిలో దుకాణాల ఎదుట వాహనాలను నిలపకూడదని, పార్కింగ్ స్థలంలోనే ద్విచక్ర వాహనాలను నిలపాలని సూచించారు. రాత్రి 11గంటల తర్వాత మద్యం సేవించి రోడ్లపై తిరిగే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. జూదం, వ్యభిచారం నిర్వహించినట్లు తెలిస్తే ఎంతటి వారైనా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోండి

ప్రజాశక్తి - మాచర్ల

మొంథా తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించి, జాగ్రత్తలు తీసుకోవాలని పల్నాడు జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐ. వెంకట్రావు అన్నారు.శనివారం మాచర్ల మండలం కొత్తపల్లి, కొప్పునూరు గ్రామాల పరిధి సాగులో ఉన్న ఉద్యాన పంటలను లాంఫాం, గుంటూరు కీటక శాస్త్రవేత్త డాక్టర్ నాగేంద్ర రెడ్డితో కలసి వెంకట్రావ్ పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ మిరపతోటల్లో వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగ దోయాలని, మొక్కలు ఉరుకెత్తి తలలు వాల్చితే తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారి చేయాలని తెలిపారు. మోహన్, వెంకటేశ్వర్లు,తులసినాయక్,రైతులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయండి

ప్రజాశక్తి - మాచర్ల

అవినీతి లేని సమాజమే లక్ష్యంగా, అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరు తమవంతుగా కృషి చేయాలని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టిపిసి) డీజీఎం జి. దివాకర్, చీఫ్ మేనేజర్లు రాము శివకోటయ్య అన్నారు. విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా శనివారం తాళ్లపల్లి సమీపంలో ఉన్న ఎన్టిపిసి ఆధ్వర్యంలో ఆ సంస్థ ఉద్యోగులు మాచర్ల పట్టణంలో రింగురోడ్డు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవినీతికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఫ్లేకార్డులు ధరించి నినదించారు. డీజీఎం దివాకర్ మాట్లాడుతూ అవినీతి అభివృద్ధికి ఆటంకమని, అవినీతి నిర్మూలనకు, అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో ఎన్టిపిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి - క్రోసూరు

అసిస్ట్ ఐటిసి ఆధ్వర్యంలో క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సర్పంచులకు ఎస్‌హెచ్‌జిలకు సిఆర్పిలకు ఘన, ద్రవ్యవ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. అసిస్ట్ కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు పిపిటి ద్వారా ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి హరితరాయబారులకు అందించాలన్నారు. అసిస్ట్ ట్రైనర్ సిహెచ్ బోలయ్య, అసిస్ట్ ట్రైనర్ బొలయ్య, క్రోసూర్ ఎంపీడీవో రవికుమార్ ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏవో రమణ, అన్ని గ్రామాల పంచాయతీ సెక్రెటరీ ఇంజ నీరింగ్ అసిస్టెంట్లు సర్పంచులు ఎస్ఎజీ మెంబర్స్ సీఆర్పీలు అసిస్ట్ నుండి కోఆర్డినేటర్ శ్రీనివాస్, ట్రైనర్ బోలయ్య, సిఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మైనార్టీ మహిళలకు కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - పెదకాకాని

వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెలలో మైనారిటీ మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాజీ బాబా దర్గా కార్యనిర్వహణ అధికారి షేక్ ఖాజా మస్తాన్ మాట్లాడుతూ శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తుల నమోదు ప్రక్రియ జరుగుతుందని, యూనిఫైడ్ మేనేజ్మెంట్ ఎంపవర్మెంట్ ఎఫిషియన్సీ అండ్ డెవలప్మెంట్ పోర్టల్ అనే వెబ్ సైట్లో వక్ఫ్ ఆస్తులను నమోదు చేయటం వల్ల భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చు అన్నారు.



వివరాలు తెలుపుతున్న ఖాజా మస్తాన్

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

పేద ప్రజల కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జొన్నల వెంకటరెడ్డి అన్నారు. ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కూడళ్లలో ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ భారత దేశ తొలి మహిళా ప్రధానిగా అమెరికా సామ్రాజ్యానికి వ్యతిరేకంగా అలీన ఉద్యమానికి నాయకత్వం వహించారని ఆయన తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ మహిళా ప్రధాని గా ఆమె అనేక సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సి సెల్ అధ్యక్షులు ఇల్లా కిషోర్, యువజన మండల అధ్యక్షులు నంబూరు సువర్ణ వర్మ, మండల ఉపాధ్యక్షులు పెద్దరంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత భావాన్ని ప్రకటిస్తున్న కళాశాల యాజమాన్యం

ఎన్ఆర్ఐలో జాతీయ ఐక్యత దినోత్సవం

ప్రజాశక్తి - మేడికొండూరు

స్థానిక ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సంజయ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ మన దేశానికి చేసిన సేవలను ప్రతి విద్యార్థి స్మరణకు తెచ్చుకోవాలని, దేశ ఐక్యత, సార్వభౌమత్వం, విద్యార్థి లోకం నుంచి ప్రారంభం కావాలని తెలిపారు. కళాశాల అక్కడ మిక్ డైరెక్టర్ డైరెక్టర్ కోట శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, కళాశాల లైబ్రరీ ఇంచార్జ్ రసూల్, వివిధ శాఖాధిపతులు, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్‌బాబు, ఏవో సీతారామయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించటం పట్ల కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

పంట పొలాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - పెదకాకాని

మొంథా తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని నంబూరు డొంకలో దెబ్బతిన్న మినుము, మిరప పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో సుమారు 900 ఎకరాల మినుము పంట దెబ్బతిందని, నష్టపోయిన రైతుల జాబితాలను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నీట మునిగిన పత్తి, మిరప, మినుము పంటలను ఏ విధంగా సంరక్షించుకోవాలో సూచించారు. ఉద్యానవన శాఖ అధికారి సి.వి.రమణ మాట్లాడుతూ మిరప పంటలో నీరు ఉంటే పొలాల గట్లను నరికి నీటిని బయటకు పంపుకోవాలని అన్నారు. మిరపకు తెగుళ్ల సోకకుండా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు గుంటూరు కెనాల్‌లో ఉన్న సమస్యలను జిల్లా వ్యవసాయ అధికారికి తెలిపారు. స్పందించిన ఆయన జిల్లా నీటిపారుదల శాఖ అధికారులకు సమస్యను వివరించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి కె.రమణకుమార్, గ్రామ వ్యవసాయ వ్యవసాయ సిబ్బంది పూర్ణ సాయి, భానుమతి, పెండ్యాల శ్రీకాంత్, మల్లికార్జున్ రెడ్డి, సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు

అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



హాజరైన మంత్రి నారా లోకేష్


ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కుంచనపల్లిలోని శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. తొలుత ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఆలయ పునర్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మంగళగిరి నియోజకవర్గ నాయకులు పోతినేని శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కాజా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో మాక్ ఎలక్షన్

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గం నుండి ఒక విద్యార్థిని అసెంబ్లీ సమావేశాలకు పంపించే కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో మాక్ ఎలక్షన్ నిర్వహించారు. ముందుగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఐదుగురికి ఐదు రకాల పూల గుర్తులు కేటాయించారు. అనంతరం విద్యార్థినిలు ఫ్లిప్ కార్డ్స్ పట్టుకొని పాఠశాల ప్రాంగణంలో స్లోగన్లతో ప్రచారం నిర్వహించారు. అనంతరం పోలింగ్ జరిగే గది తలుపు వద్ద ఒకరు పోలీసు పాత్ర నిర్వహించి ఒకరి తర్వాత ఒకరిని ఓటు వేయటానికి పంపించారు. ఏపీఓ కు గుర్తింపు కార్డు చూపించిన అనంతరం ఆమె ఏజెంట్లకు పేరు తెలిపినది. అక్కడ నుండి ఓపిఓ వేలిపై గుర్తు వేయగా మరో ఓపిఓ ఓటు ఇచ్చారు. కంపార్ట్మెంట్లో ఓటు వినియోగించుకొని బ్యాలెట్ బాక్స్‌లో వేశారు. అనంతరం ఏజెంట్ల సమక్షంలో అధికారులు కౌంటింగ్ చేసి గెలుపొందిన విద్యార్థినిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఓటు హక్కు ఎలా వినియోగించు కోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనేందుకు మంగళగిరి వెళ్లినట్లు ప్రధాన ఉపాధ్యాయురాలు ఎస్.సోమాదేవి తెలిపారు.



నామినేషన్ వేస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న ఎస్.ఎస్.చెంగయ్య

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 15, 16 తేదీలలో ఒంగోలులో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.చెంగయ్య కోరారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం పి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర మహాసభల సందర్భంగా నవంబర్ 15వ తేదీన ఒంగోలులో జరిగే బహిరంగ సభకు జిల్లా నుండి పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్మికులు తరలిరావాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బి.ముత్యాలరావు, ఎం.రవి, పి.కృష్ణ, కె.శివయ్య, కె.వెంగమ్మ, సిహెచ్.పార్వతి, పి.పూర్ణచంద్రరావు, వై.శివనాగేశ్వరరావు, తోకల బాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎంపిపి

పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

ప్రజాశక్తి - దుగ్గిరాల

పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపిపి షేక్ జబీన్ తెలిపారు. తుపాన్ కారణంగా పునరావాస కేంద్రాలలో ఉన్న పేదలకు శుక్రవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యంతో పాటు వంటనూనె కందిపప్పు పంచదార ఉల్లిపాయలు టమాటాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఆస్తి నష్టం ప్రాణం నష్టం జరగకుండా ముఖ్యమంత్రి ఇతర నాయకులు నిరంతరం పర్యవేక్షించారన్నారు. నాయకులతో పాటు కార్యకర్తలు కూడా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. మండల వ్యాప్తంగా 15 పునరావాస కేంద్రాలలో 617 మందికి ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేశనేని శ్రీ అనిత వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ ఛైర్మన్ ఉన్నం యూనీస్ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు మాజీ ఎంపీపీ వెనిగళ్ళ కృష్ణప్రసాద్ ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, ఈమని సర్పంచ్ సిద్దెల శ్రీవాణి, ఉజ్వల హరిణి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. సూపర్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో గ్రామంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎ.కె.బాబు తెలిపారు. ప్రధాన వీధులు, కాల్వలు శుభ్రపరచడం, చెత్త సేకరణ, చెరువుల పరిసరాల్లో మలినాలు తొలగించడం వంటి పనులు చేపట్టారు.

ప్రతి సంవత్సరం ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి - దుగ్గిరాల

హెచ్‌పి గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక ఇన్నాన్ గ్యాస్ ఏజెన్సీస్ ప్రతినిధి గద్దె శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక నుండి ప్రతి సంవత్సరం ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప అధ్యక్షతన శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జోజప్ప మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ధైర్యవంతులుగా విద్యార్థులు ఎదగాలని కోరారు. దేశ సేవలో నిమగ్నమై జీవించిన వల్లభాయ్ పటేల్ అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసే ఆలోచనతో భారతీయులందరూ ఒక్కటే అనే నినదించారని అన్నారు. ఈ కార్యక్రమంలో చావా శ్రీనివాసరావు, ఆనంద వెంకటేశ్వరరావు, ఇసుకపల్లి శరత్‌చంద్ర, తోట శ్రీనివాస రావు, సుబ్బలక్ష్మి, పి.విజయ్ కుమారి, వసంతరావు, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

ఉక్కు మనిషి, భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం నగరంలోని ఏపీ ఎస్పీ ఆరవ బెటాలియన్‌లో ఏక్తా దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ హనుమంతు, రవి తో పాటు పలువురు బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

జాతీయ ఏకతా దినోత్సవం సందర్భంగా నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, మంచా విజయమోహనరావు హాజరై మాట్లాడారు. అనంతరం సైమైక్యత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్రీయ ఏక్తా దివాస్ జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను తెనాలిలో ఘనంగా నిర్వహించారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా ఐక్యత దినోత్సవ వేడుకలను ఎన్సిసి, స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులు మధ్య నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని తెనాలి డిఎస్పి ఎస్.జనార్దనరావు తెలిపారు. వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నంతరం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్ఐ సాంబశివరావు, సిఐలు రాములు నాయక్, మల్లికార్జునరావు, ఎస్ఐలు షేక్ కరీముల్లా, ఆనంద్, బ్రహ్మయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విభజించి పాలిస్తున్న అధికారులు

ఎమ్మెల్యే గళ్లా మాధవి ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తనకు తెలియ కుండా ప్రభుత్వ కార్యాక్రమాలు నిర్వహించడం, ప్రోటోకాల్ పాటించకపోవటంపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులో విభజించు పాలించు అనే విధంగా అధికారుల ధోరణి ఉందని, నియోజకవర్గములో ఉన్న ప్రజా ప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు వచ్చే విధంగా అధికారులు రాజకీయం చేస్తున్నారని శుక్రవారం ఆమె మండిపడ్డారు. గత మూడు రోజులుగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు తగిన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. అయితే అధికారులు తనకు తెలియకుండా మరికొన్ని చోట్ల కార్యక్రమాలు నిర్వహించి ఇతర ప్రజా ప్రతినిధులను పిలిచి తనకు సమాచారం ఇవ్వకపోవటం ఏంటని ప్రశ్నించారు. అధికారులు రెండు విడివిడిగా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అవసరమా? మేయర్, కమిషనర్ చేసిన కార్యక్రమంపై తమకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. తాను పాల్గొన్న కార్యక్రమంలో వీరిద్దరు లేరని తన నియోజకవర్గములో కనీస మర్యాద పాటించకుండా కార్యక్రమం నిర్వహించటం నాకు చాలా బాధ కలిగించిందని మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రోటోకాల్ ఎక్కడ? బ్యానర్లలో ప్రజాప్రతినిధులు ఎందుకు లేరని ప్రశ్నించారు. మేయర్, కమిషనర్ ఫోటోలతో వేసిన బ్యానర్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన ఫోటోలు ఎందుకు లేవన్నారు. తాను పంపిణీ చేసిన చోట మేయర్, కమిషనర్ ఫోటోలు లేవని అధికారులు ఇలా విభజించి పాలించేధోరణి పోవాలన్నారు. ఇదే విషయాన్ని తాను సిఎం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. "ఇది అమాయకత్వమా? అవివేకమా? లేక అహంకారమా?అని ధ్వజమెత్తారు. ఇలా ఎవరు ప్లాన్ చేశారో కమిషనర్ వివరణ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటో లేకుండా కార్యక్రమాలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. గతంలో మెప్మా విభాగం నిర్వహించిన కార్యక్రమాల్లో చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోలు లేకుండా నిర్వహించడం కూడా గళ్ళా మాధవి ప్రస్తావించారు. '24వ డివిజన్‌లో కార్యక్రమంపై తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఎవరు కారణం? దానికి సమాధానం రావాలి," అని గళ్ళా మాధవి అన్నారు.



మీడియాకు పేపర్ క్లిప్పింగ్స్ చూపుతున్న ఎమ్మెల్యే

ఎఎన్‌యు దూరవిద్య డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో ఈ ఏడాది జూలై, ఆగస్టు మాసాలలో జరిగిన డిగ్రీ సప్లమెంటరీ సంవత్సరాంతపు పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ తెలిపారు. ఈనెల 12వ తేదీలోగా రీవాల్యుయేషన్ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ప్రతి పేపర్ కు రూ. 770 చొప్పున ఫీజు చెల్లించాలని వెల్లడించారు. పూర్తి వివరాలను వర్సిటీ వెబ్సైట్ నుండి పొందవచ్చని సూచించారు.

మైనార్టీలకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

మైనార్టీ అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్, టెట్, డిఎస్సీ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, షేక్.సబీరాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. అర్హతగల మైనారిటీస్ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో https://apcedmmwd.org పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అర్హతగల మైనారిటీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు వివరములకు మైనార్టీ కార్పొరేషన్ జిల్లా కార్యాలయంలోగానీ, 0866-2970567 నంబరులో సంప్రదించాలన్నారు.



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలి

ప్రజాశక్తి-గుంటూరు : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ ఉపా ధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు కోరారు. ఈమేరకు ఈమేరకు శుక్రవారం జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు, జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు, సెక్రెటరీ జనరల్ కె.వీరాంజనేయులు మాట్లాడుతూ సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్‌పై స్పష్టత ఇవ్వాలని కోరారు. గత 25 సంవత్సరాలకు పైగా బోధనలో ఉన్న ఉపాధ్యాయులు ఇటీవల వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) రాయాలి అని విద్యాశాఖ చెప్పడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకు వచ్చి చట్టపరమైన మార్పులు చేయడం ద్వారా ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని లేని పక్షంలో లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ డి.కె.సుబ్బారెడ్డి, ఎమ్.డి.ఖలీద్, జిల్లా కార్యవర్గసభ్యులు ఎమ్.కళాధర్, కె.బసవలింగారావు, నాయకులు జి. వెంకటేశ్వరావు, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో మాదక ద్రవ్యాల నివారణ

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో మాదకద్రవ్యాలపై నివారణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి అని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నివారణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ మత్తు, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఆవిష్కృతం చేయాలన్నారు. రవాణా వ్యవస్థపైన, విద్యా సంస్థలుపైన గట్టి నిఘా ఉండాలని చెప్పారు. అన్ని పాఠశాలలు, కళాశాలలలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు, మాదక ద్రవ్యాల దిశగా అడుగులు వేయకుండా అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. మత్తు, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం, తయారీ, సరఫరా వంటి సమాచారం ఎక్కడ ఉన్నా తక్షణం పోలీసు అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. మందుల దుకాణాలలో కొన్ని మందులను వైద్యుల సలహాల మేరకు మాత్రమే వినియోగించాలని, నిబంధనలు ఉల్లంఘించే మందుల దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో ముఖ్యంగా యువతలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించి, మత్తు మాదక ద్రవ్యాలు వలన ఆరోగ్యంపైనా, ఆర్థికంగాను పడే ప్రభావాలు తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల వలన కుటుంబం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా బంధువులను, స్నేహితులను కోల్పోవడం జరుగు తుందని వివరించారు. ఎస్పీ వకుల జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో 2025 సంవత్సరంలో ఇప్పటి వరకు 65 కేసులు నమోదు చేశామని, 26 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఏడుగురుపై పి.డి కేసులు నమోదు చేశామని వివరించారు. ఒడిశా రాష్ట్రంతోపాటు, ఆరాష్ట్ర సరిహద్దుల జిల్లాల నుండి రవాణా ద్వారా జిల్లాకు చేరడంతో పాటు ఇతర నగరాలకు రవాణా అవుతున్నట్లు గుర్తించామన్నారు. మత్తు, మాదక ద్రవ్యాల తయారీ, సరఫరా, వినియోగం, రవాణాలో ఎక్కువ సార్లు భాగస్వామ్యం అవుతున్న వ్యక్తులపై హిస్టరీ షీట్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. 130 మంది ఎక్కువ సార్లు ఈ కార్యకలాపాలలో భాగస్వామ్యం అయినట్లు గుర్తించామన్నారు. నగర పాలక సంస్థ శివారు ప్రాంతాల్లోను, నిరుపయో గంగా ఉన్న భవనాల్లోనూ గంజాయి, మత్తు పదార్థాల వినియోగదారులు చేరుతున్నట్లు సమాచారం అందుతుందని, అటువంటి ప్రదేశాలపట్ల జిఎంసి అధికారులు కూడా దష్టి సారించాలని కోరారు. 839 ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒత్తిడి నివారణ మాత్రలను వైద్యుల చీటి లేకుండా మందుల దుకాణాలు విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం ఉందని, దానిపై దృష్టి సారించాలని అన్నారు. వసతి గృహాల్లోనూ నిఘా ఉండాలని, సామాన్య వస్తువులుగా ప్యాకింగ్‌చేసి ఆర్టీసి రైలు, ఇతర మాధ్యమాల ద్వారా రవాణా చేస్తున్నారని వాటి పట్ల డ్రైవర్లకు, కండక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ ఎన్ఎస్‌కె. ఖాజావలి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రామకృష్ణ, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి. రమణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. వరకట్న నిషేధ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఎక్కువ అవగాహన కల్పించాలని, గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక స్తోమత పెంచడం అవసరం అన్నారు. వివాహం తర్వాత విధిగా నమోదు జరగాలని స్పష్టం చేశారు. వరకట్న నిషేధచట్టం ద్వారా వరకట్నం అడగటం, తీసుకోవడం నేరమని, 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, రూ.15వేల వరకు అపరాధ రుసుం విధించటం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన - వరకట్న నిషేధ చట్టం వివరాలను తెలిపారు. జీ.ఓ.28 ప్రకారం బాధితులకు నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గహహింస చట్టం కింద 2022 సంవత్సరంలో 666 కేసులు, 2023లో 588, 2024లో 483 కేసులు, 2025లో 446 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ రామకష్ణ, న్యాయ సలహాదారు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వుత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్నపోలీసు అధికారులు

పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా గుంటూరులో శుక్రవారం రాత్రి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు అధికారులు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ ఎస్‌బిఐ కూడలి వద్ద పోలీస్ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. అదనపు ఎస్‌పి హనుమంతు, డిఎస్‌పిలు అరవింద్, అజీజ్, బెల్లం శ్రీనివాస్, సిఐలు అలహరి శ్రీనివాస్, వీరయ్య చౌదరి, సత్యనారాయణ, అశోక్ కుమార్, సింగయ్య, శ్రీహరి రెడ్డి, సురేష్, పలువురు ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో ముప్పేట దాడి

సమస్యలపై అధికారులను నిలదీసిన వైసిపి, టిడిపి, జనసేన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - తెనాలి



ప్రశ్నిస్తున్న వైసిపి కౌన్సిలర్లు



మాట్లాడుతున్న కమిషనర్

వార్డులలో సమ స్యలు పేరుకు పోతు న్నాయి. ప్రతి సమావేశంలోనూ మొత్తు కోవడం మినహా అధికారుల నుంచి స్పందన లేదు. కౌన్సిలర్లకు విలువ లేకుండా పోతుందని వైసిపి, టిడిపి, జనసేన పార్టీల కౌన్సిలర్లు వాపోయారు. మరోవైపు మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ ఆరోపించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. అజెండా అంశాలను చదవటం ప్రారంభించగానే వైసిపి కౌన్సిలర్‌లు ఆవుల కోటయ్య, అన్నాబత్తుని పద్మజ తమ వార్డులలో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై ప్రశ్నించారు. ఎఇ సునీల్ బదులిస్తూ త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని, అత్యవసరంగా చేయవలసినవి రెండు రోజులలో ప్రారంభిస్తామని బదులిచ్చారు. వైసీపీ నుంచి జనసేనకు వచ్చిన కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసా రెడ్డి, కొమరాబత్తుని జయపాల్ మాట్లాడుతూ జిల్లా వైద్యశాల రోడ్డుకు మంత్రి మనోహర్ శంకుస్థాపన చేసి నెలలు దాటుతున్నా పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. రోడ్డు పాడైపోయి వైద్యశాలకు వచ్చి వెళ్లే రోగులు సందర్శకులు నానాయాతన పడుతున్నారని చెప్పారు. కనీసం గుంతలు పూడ్చాలని కోరారు. త్వరలో మరమ్మతులు చేయిస్తామని ఎంఈ శ్రీకాంత్ హామి ఇచ్చారు. పట్టణంలో కుక్కల సమస్య ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య కోరారు. దీనిపై కౌన్సిలర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో కమిటీ వేసి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ జె రామ అప్పలనాయుడు హామి ఇచ్చారు. వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, అన్నం పిన్నారావు, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్ తమ తమ వార్డులలోని సమస్యలపై ఏకరువు పెట్టారు. వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, వివిద విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు

పట్టణంలోని 15వ వార్డుకు చెందిన వైసిపి కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు తీవ్ర ఆరోపణలు చేశారు. మున్సిపల్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదంటూ వ్యాఖ్యానించారు. అజెండాలో పొందుపరిచిన రూ.44 లక్షలు నిర్వహణ ఖర్చుల కింద చూపారని, రూ.4 లక్షలు అదర్స్ పేరిట చూపారని, అవి దేనికి వెచ్చించారని ప్రశ్నించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవటంతో ప్రజాధనాన్ని ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నించారు. అభివృద్ధికి నిధులు లేవంటూ చెబుతున్న అధికారులు ఇలా లక్షల రూపాయలు లెక్కలు చూపకుండా వెచ్చించటం దారుణం అన్నారు. ఈలోగా టిడిపి కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, అలుసు మళ్లీ వెంకటేశ్వరరావు జోక్యం చేసుకుని మున్సిపల్ కార్యాలయం వెనుక అసంపూర్తిగా ఉన్న భవనాన్ని ఆ నిధులతో పూర్తి చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని వ్యాఖ్యానించారు.